సాక్షి
కుమురం భీం

బుధవారం, 5, ఏప్రిల్, 2023



'కేజీబీవీ'లో ఎంసెట్ కోచింగ్

కేజీబీవీల్లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత ఎంసెట్ శిక్షణ అందిస్తోంది. జూమ్ యాప్ ద్వారా వారికి పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. 8లో

మహనీయులను స్మరించుకుందాం

ఆసిఫాబాద్‌అర్బన్: మహనీయులను మరోసారి స్మరించుకుందామని కలెక్టర్ హేమంత్ బోర్కడే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ 116 జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
37.8 /24.5

వాతావరణం

ఆకాశం పాక్షిగంగా మేఘావృతమౌతుంది. చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. గాలిలో తేమతో ఉక్కపోత పెరుగుతుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:30	గురు : 4:43

కులవృత్తికి ప్రోత్సాహం

- జిల్లాలో నాలుగు విడతల్లో కుమ్మరులకు ప్రత్యేక శిక్షణ
- ఆధునిక పద్ధతులతో ఆకట్టుకునేలా మట్టి పాత్రల తయారీ
- మార్కెటింగ్ కోసం త్వరలో జిల్లా కేంద్రంలో షెడ్లు



యంత్రాలపై తయారు చేసిన వివిధ రకాల మట్టిపాత్రలు

రెబ్బెన(ఆసిఫాబాద్): కుమ్మర కులవృత్తిని ఆధునిక పద్ధతుల్లో చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తోంది. యంత్రాలపై పాత్రల తయారీపై జిల్లాలో విడతల వారీగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. మట్టి సారె స్థానంలో యంత్రపు సారెలు రానున్నాయి. శిక్షణతోపాటు యంత్రాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. సామగ్రిని అమ్ముకునేందుకు ప్రత్యేక వేదికను సైతం ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాగం అడుగులు వేస్తోంది.

రూ.28 లక్షలతో యంత్రాలు



శిక్షణ కేంద్రంలో యంత్రాలపై మట్టి పాత్రల తయారీని నేర్చుకుంటున్న కుమ్మరులు

జిల్లాలోని 12 మండలాల్లో కుమ్మర వృత్తిదార్లు ఉన్నారు. కులవృత్తినే నమ్ముకుని సుమారు 200 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఆధునాతన మట్టి పాత్రలు, వంటింటి పాత్రలు, అలంకరణ కోసం ఉపయోగించే వస్తువుల తయారీపై ప్రత్యేక తర్ఫీదు పొందుతున్నారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ సహకారంతో జిల్లాలో కుమ్మరులకు మట్టి పాత్రల తయారీపై ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. శిక్షణతోపాటు యంత్రాల కోసం రూ.28 లక్షలు కేటాయించారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి, కౌటాల మండలం తలోడి, బెజ్జూర్ మండలం బారెగూడలో మూడు విడతల్లో 142 మందికి శిక్షణ అందించారు. నాలుగో విడత శిక్షణ శిబిరం ప్రస్తుతం రెబ్బెన మండలం కైరిగాంలో కొనసాగుతోంది. ఇక్కడ 50 మంది శిక్షణ పొందుతున్నారు. ప్రత్యేక ట్రైనర్ వీరికి 15 రోజుల పాటు శిక్షణ అందించనున్నారు.

సంప్రదాయ పద్ధతులకు స్వస్తి..

గతంలో కర్ర సారెల సాయంతో సామగ్రి తయారీ కోసం కుమ్మరులు శారీరకంగా తీవ్ర శ్రమ పడేవారు. చెరువుల నుంచి తెచ్చిన మట్టిని నానబెట్టి కాళ్లతో తొక్కి పాత్రల తయారీ కోసం సిద్ధం చేసేవారు. ప్రస్తుతం బ్లెంజర్, ఫగ్‌మిల్లు, జగర్‌జాలీ యంత్రాలతో వారికి శారీరక శ్రమ తగ్గింది. కర్రీ గిన్నెలు, రైస్ గిన్నెలు, బిర్యానీ పాత్రలు, కడాయిలు, వాటర్ బాటిల్స్, టీకప్పులు, వాటర్ గ్లాసులు, జగ్గులు, ఫ్లవర్ పాట్స్, తులసీ దీపం, అన్ని రకాల గుజరాతీ బిందెలు, ఆఫీస్ టేబుల్ పెన్నుల స్టాండ్, లైటింగ్ కటింగ్ పాట్స్, వాటర్ ఫిల్టర్, సురాయిలు, 40లీ, 50 లీటర్ల రంజన్‌లు, 5ఫీట్ల ఎత్తు కలిగిన దీపం, మనీబ్యాంక్, అగర్‌వొత్తుల స్టాండ్, గండదీపం వంటి వస్తువులు తయారు చేస్తూ ఔరా అనిపించుకుంటున్నారు.

మార్కెటింగ్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం

కుమ్మరులు తయారు చేసే మట్టి పాత్రలను సులువుగా అమ్ముకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రోత్సాహం అందించే దిశగా అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా షెడ్డును ఏర్పాటు చేసి మట్టిపాత్రలను విక్రయించుకునేందుకు కృషి చేస్తామని అడిషనల్ కలెక్టర్ రాజేశం ఇప్పటికే హామీ ఇచ్చారు. మంచిర్యాల వంటి ప్రాంతాల్లోనూ షెడ్ల ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో కలిసి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు భారతీయ యువశక్తి ట్రస్ట్ ముందుకొచ్చింది.

మట్టి తెచ్చుకునేందుకు అవకాశమివ్వాలి



పాత్రల తయారీకి అవసరమైన మట్టిని చెరువుల్లో నుంచి తెచ్చుకునేందుకు కుమ్మరులకు అవకాశం ఇవ్వాలి. ప్రస్తుతం ఈస్‌గాం, లోనవెల్లి ప్రాంతాల్లోని చెరువుల నుంచి మట్టిని తీసుకువస్తున్నాం. ట్రాక్టర్ మట్టికి రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతోంది. స్థానిక చెరువుల్లో మట్టిని కేవలం కుమ్మరులకు మాత్రమే కేటాయించాలి. మట్టి పాత్రలను బట్టిలో కాల్చేందుకు అవసరమైన కట్టెలను అడవి నుంచి తెచ్చుకునేందుకు అనుమతినివ్వాలి.

– ఉప్పులేటి శంకర్, నంబాల

రూ.12లక్షలతో కుటీర పరిశ్రమ



సాలెగూడలో వచ్చే నెలలో ప్రభుత్వం రూ.12లక్షలతో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. ఎకరం స్థలాన్ని కేటాయించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.11లక్షలతో 100 యంత్రాలను అందించనుంది. నాలుగు విడతల్లో దాదాపు 192 మంది శిక్షణ పొందారు.

– కుమ్మరి మల్లేశ్, కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షుడు

15 రోజులపాటు శిక్షణ



జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో మట్టి పాత్రల తయారీపై ప్రత్యేక శిక్షణ అందించాం. బారెగూడ, కైరిగాంలో మట్టి పాత్రల తయారీపై శిక్షణ ఇచ్చా. కులవృత్తిపై పట్టున్న వారు తొందరగా నేర్చుకోగలుగుతున్నారు. మార్కెట్‌లో మట్టి పాత్రలకు డిమాండ్ ఉంది. నైపుణ్యం ఉంటే వంట పాత్రల నుంచి అలంకరణ వస్తువుల వరకు అన్ని మట్టితోనే చేయవచ్చు.

– రమేశ్, ట్రైనర్, వికారాబాద్

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, డీఈవో అశోక్, ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గత రెండు రోజుల్లో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తనిఖీ అధికారులు తమ మొబైల్ ఫోన్లను కేంద్రాల్లోకి తీసుకెళ్లకుండా చూడాలన్నారు. పోలీసు, విద్యా, తపాలాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జవాబు పత్రాలు తరలించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, కేంద్రాల్లోకి బయటి వ్యక్తులు వెళ్లకుండా పూర్తిస్థాయి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడే మాట్లాడుతూ జిల్లాలో 39 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం సంబంధిత శాఖల అధికారులతో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ సురేశ్‌కుమార్, డీఈవో అశోక్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, కోఆర్డినేటర్ ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సైన్స్ విద్యార్థులకు ఉచిత నమూనా ఎంసెట్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఎంసెట్‌కు దరఖాస్తు చేసుకున్న సైన్స్ విద్యార్థులు ఉచిత నమూనా ఎంసెట్‌కు రిజిస్టర్ చేసుకోవాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్స్‌ప్లోర్ సంస్థ ఆధ్వర్యంలో నమూనా ఆన్‌లైన్ పరీక్షలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారని పేర్కొన్నారు. విద్యార్థులు https://tseamcet.xplore.co.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు 5, 15, 20 తేదీల్లో మూడు రోజులపాటు ఈ నమూనా టెస్టులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు తమకు అనుకూలమైన తేదీల్లో టెస్టులకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోని అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులు నమూనా ఎంసెట్‌లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.

20న మెగా జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్, తదితరులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 20న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ సురేశ్‌కుమార్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాలో 40కి పైగా కంపెనీల్లో 3,500 వరకు ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఈవో అశోక్, జిల్లా టూరిజం అధికారి రామకృష్ణ, డీఆర్‌వో రాజేశ్వర్, ఎంజీఎస్‌ఎఫ్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

సిర్పూర్(టి): మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని డీఈవో అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మన ఊరు– మన బడి కార్యక్రమం పనులపై కాంట్రాక్టర్లు, ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తిచేసి, పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సోమయ్య, సెక్టోరియల్ అధికారి భరత్, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తుకారాం, ఏపీవో రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



పీహెచ్‌సీలో మహిళలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్‌రెడ్డి

దహెగాం(సిర్పూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళ క్లినిక్‌లో వైద్యసేవలపై మంగళవారం ఆయన ఆరా తీశారు. మహిళలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు, వైద్యాధికారి స్పందన, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

మరో కొండగట్టు.. కేస్లాపూర్ అంజన్న

- ప్రముఖ భక్తిక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన ఆలయం
- గోండుల కాలంలోనే వీరాంజనేయుడికి పూజలు
- రేపు వైభవంగా జయంత్యుత్సవాలు



కేస్లాపూర్ వీరాంజనేయస్వామి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి ఈశాన్య ప్రాంతంలో ఉత్తర వాహిని నదీ తీరంలో వెలసిన కేస్లాపూర్ వీరాంజనేయస్వామి ఆలయం మరో కొండగట్టు పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. గోండు రాజుల కాలంలో కేస్లాపూర్‌లో విశేష పూజలందుకున్న వీరాంజనేయుడు భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నాడు. మహిమాన్వితుడై విశేష పూజలందుకుంటున్నాడు. ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని 41 రోజులుగా వందలాది మంది దీక్షాపరులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు వాంకిడి, కెరమెరి, రెబ్బెన మండలాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు.

గోండు రాజుల కాలంలోనే ఆలయం..

గోండు రాజుల కాలంలో కేస్లాపూర్ గ్రామంలో వీరాంజనేయుడు వెలిసినట్లు పెద్దలు చెబుతున్నారు. నిజాం హయాంలో కేస్లాపూర్ గ్రామాన్ని గోండులు విడిచి వెళ్లిపోగా ఆనవాళ్లు లేకుండా పోయాయి. అనంతరం 1969లో ఇక్కడి పెద్దవాగుపై గుత్తేదారు వంతెన నిర్మాణ పనులు చేపట్టగా.. వరద ఉధృతికి పలుమార్లు నిర్మాణాలు కొట్టుకుపోయాయి. ఆందోళనలో ఉన్న గుత్తేదారు కలలోకి వీరాంజనేయుడు వచ్చి వాగు ఒడ్డున విగ్రహం తిరిగి ప్రతిష్టిస్తే వంతెన నిర్మాణం సజావుగా కొనసాగుతుందని సూచించినట్లు స్థానికులు చెబుతుంటారు. గుత్తేదారు వీరాంజనుయుడి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించి గుడి నిర్మించాడు. ఆ తర్వాత వంతెన పూర్తికావడం, ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రచారం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. గడిచిన దశాబ్దం నుంచి ఉత్సవాలు, భక్తి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికల ముందు రాజకీయ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను స్వామి వారి ముందుంచి పూజలు చేసి సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి

కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో నూతన ఆలయం నిర్మించి వసతి గదులు, భోజనాలయం, నవగ్రహాల ఏర్పాటు, నీటి వసతులు కల్పించారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో శుభకార్యాల వేదిక నిర్మాణం చేపట్టారు. ఆలయానికి చుట్టూ ఉన్న ఐదున్నర ఎకరాల స్థలాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సేకరించారు. చైత్ర పౌర్ణమి రోజు హనుమాన్ జయంతి ఉత్సవాలకు 41 రోజుల ముందు భక్తులు హనుమాన్ మండల దీక్షలు స్వీకరిస్తారు. ఆలయాన్ని పవిత్ర క్షేత్రంగా భావిస్తూ దీక్షాపరులు ఇక్కడే ఉంటారు. ఆలయ ముఖద్వారం పక్కన రాష్ట్రీయ రహదారిని ఆనుకుని నిర్మించిన 41 అడుగుల అభయాంజనేయస్వామి భారీ విగ్రహం పట్టణానికి మకుటాయమానంగా ఉంది.

ఉత్సవాలు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయి. కలశ గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ వచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, నవగ్రహ స్థాపన, పూజ, స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర తమలా పత్ర, సహస్ర ఫల పుష్పార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు.

దక్షిణముఖం ప్రత్యేకం

ఆలయంలో ఆంజనేయస్వామి ముఖం దక్షిణ దిక్కు ఉండడం ప్రత్యేకం. రెండు దశాబ్దాలుగా దీక్షలు తీసుకున్న స్వాములు ఆలయంలోనే శిబిరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. భక్తుల తాకిడి ఏటా పెరుగుతునే ఉంది. కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– వొజ్జల శిరీష్‌శర్మ, ఆలయ అర్చకులు

'మహిళ క్లినిక్'లకు ఆదరణ

- జిల్లాలో గిన్నెధరి, దహెగాం పీహెచ్‌సీల్లో మహిళ ఆరోగ్య కేంద్రాలు
- ప్రతీ మంగళవారం ప్రత్యేక వైద్యపరీక్షలు
- వినియోగించుకుంటున్న గ్రామీణ మహిళలు



పేర్లు నమోదు చేసుకుంటున్న మహిళలు



మహిళను పరీక్షిస్తున్న వైద్యాధికారి

దహెగాం(సిర్పూర్): మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య క్లినిక్‌లకు ఆదరణ లభిస్తోంది. మహిళలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వైద్యపరీక్షలు చేయించుకుంటున్నారు. మార్చి 8న జిల్లాలోని దహెగాం, తిర్యాణి మండలం గిన్నెధరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉమెన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కులతో కలిసి కలెక్టర్ హేమంత్ బోర్కడే ఈ కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించారు. ప్రతీ మంగళవారం ఇక్కడ మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు.

మంగళవారం వైద్యపరీక్షలు..

కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం కళకళలాడుతుంది. అయితే కుటుంబ బాధ్యతలు, ఆర్థిక కారణాలు, అవగాహన లేక చాలా మంది మహిళలు తమ ఆరోగ్య సమస్యలు బయటికి చెప్పుకోవడం లేదు. స్థానిక ఆర్‌ఎంపీలను సంప్రదించి తాత్కాలికంగా వైద్యం చేయించుకుంటున్నారు. దీంతో వ్యాధుల తీవ్రత తెలియక ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ కేంద్రాలను ప్రారంభించింది. దహెగాం, గిన్నెధరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని మహిళ క్లినిక్‌ల్లో ఇప్పటివరకు 550 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. దహెగాంలో 37 మంది, గిన్నెధరి సుమారు 20 మందిని జిల్లా కేంద్రానికి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు.

మెరుగైన వైద్యం..

మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 100 మహిళ ఆరోగ్య క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో వచ్చిన ఫలితాల ఆధారంగా మరిన్ని చోట్ల వీటిని విస్తరించనున్నారు. మహిళ ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ క్లినిక్‌లకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒక్కో కేంద్రంలో సగటున 70 నుంచి 80 మంది ఓపీ చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతీ మంగళవారం ఓపీ పెంచేందుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు పంచాయతీ అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో మొత్తం ఎనిమిది రకాల ప్రధాన వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తహీనత వంటి ప్రాథమిక పరీక్షలు కచ్చితంగా చేస్తున్నారు. బాధితులు చెప్పిన లక్షణాల ఆధారంగా ఓరాల్, సర్వేకర్, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, మూత్ర కోశ సంబంధించిన ఇన్‌ఫెక్షన్లు, నెలసరి సమస్యల స్క్రీనింగ్ చేస్తున్నారు. ఎక్కువగా గైనిక్‌కు సంబంధించిన సమస్యలు గుర్తిస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. సేకరించిన శాంపిళ్ల ఆధారంగా మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను సిబ్బంది ఆరోగ్య మహిళ యాప్‌లో పొందుపరుస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఆరోగ్య క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. సగటున 80 మంది కేంద్రానికి వచ్చేవిధంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, మందులు అందజేస్తున్నాం. మేజర్ సమస్యలు ఉంటే జిల్లా కేంద్రానికి రెఫర్ చేస్తున్నాం.

– స్పందన, వైద్యాధికారి, దహెగాం

52 మంది గైర్హాజరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా నిర్వహించారు. 39 పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 6,677 మంది విద్యార్థులకు 6,625 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారని డీఈవో అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హేమంత్ బోర్కడే తనిఖీ చేశారు. డీఈవో అశోక్ కాగజ్‌నగర్ పట్టణంలోని ఏడు కేంద్రాలను పర్యవేక్షించగా, జిల్లా కేంద్రంలోని సెంటర్లను పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, రెబ్బెనలోని పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించాయి.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని విద్యార్థులకు బైజూస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ల్యాప్‌టాప్, మొబైల్ అందించినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని జేఈఈ, ఎంసెట్ తదితర వాటిల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్లు పొందేలా నైపుణ్యం సాధించాలని సూచించారు. బైజూస్ సంస్థ ప్రతినిధి అభిలాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న రిటైర్డ్ ఉద్యోగుల రౌండ్‌టేబుల్ సమావేశం

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఈ నెల 6న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కేంద్ర ఉపాధ్యక్షుడు ఆలవేందార్ వేణుమాధవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రం సోయబ్‌హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెన్షన్ పెంపుదల, వైద్యచికిత్సలు, ఉచిత క్వార్టర్లు, ఇంటిస్థలం, గ్రాట్యుటీ, తదితర సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవాలి

కాసిపేట(బెల్లంపల్లి): 2023–24 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేయాలని కాసిపేట గ్రూప్ ఆఫ్ ఏజెంట్ కుర్మ రాజేందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్ సూచించారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై వార్షిక లక్ష్యాలు, రక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వివిధ కేటగిరీల్లో ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలు అందించారు. వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి బైరి శంకర్, ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, రక్షణాధికారి సునీల్‌కుమార్, డెప్యూటీ మేనేజర్ నిఖిల్, సంక్షేమాధికారి మీర్జాజి గౌస్, మధుకర్, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణంపై నోటీస్ జారీ

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 100లో ఉన్న భూమిలో అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్న పీవీ రమణకు మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు నోటీస్ జారీ చేశారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి పత్రాలు ఏడురోజుల్లోగా కార్యాలయంలో అందజేయాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని నోటీస్‌లో సూచించారు. గతేడాది కూడా మంజులకు నోటీస్ జారీ చేసిన విషయాన్ని టీపీఎస్ రాజ్‌కుమార్ గుర్తుచేశారు. గత నెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రభుత్వ భూమిలో వెంచర్ ...' కథనానికి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. త్వరలోనే ఆ సర్వే నంబర్‌లోని 1.23 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

బుగ్గ ఆలయ పూజారి సస్పెన్షన్..!

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయ పూజారిని విధుల్లో నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది. పూజారి వేణుగోపాల శర్మ విధి నిర్వహణలో భక్తులతో అనుచితంగా వ్యవహరించడంతో పాటు అనుమతి లేకుండా పెళ్లిళ్లు జరుపుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. దేవాదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ విచారణ జరిపించి సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలుస్తోంది.

కేజీబీవీలో ఎంసెట్ కోచింగ్



ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదివేది పేద విద్యార్థినులే. బాలికల చదువును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో ఉచితంగా ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ముగియడంతో విద్యార్థినులు ఇంటిబాట పట్టారు. ఖాళీగా ఉండకుండా జూమ్ యాప్ ద్వారా వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ తరగతులను బోధిస్తున్నారు. గతంలో కూడా కేజీబీవీల్లో చదివిన విద్యార్థినులు ఇంజనీరింగ్, నర్సింగ్ తదితర కోర్సుల్లో సీట్లు సాధించారు. లక్షల రూపాయలు వెచ్చించి శిక్షణ పొందలేని విద్యార్థినులకు ఈ శిక్షణ వరంగా మారనుంది.


కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు (ఫైల్)

- జూమ్ ద్వారా ప్రత్యేక శిక్షణ
- బాలికల విద్యను ప్రోత్సహించేందుకు కసరత్తు
- గతేడాది పలువురికి ఎంసెట్, నర్సింగ్ సీట్లు

జిల్లా	ఇంటర్ కేజీబీవీలు	విద్యార్థుల సంఖ్య
ఆదిలాబాద్	09	161
నిర్మల్	06	94
మంచిర్యాల	05	87
ఆసిఫాబాద్	06	77

జూమ్ యాప్ ద్వారా ప్రత్యేక శిక్షణ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 26 ఇంటర్మీడియెట్ కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ) ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యాబోధన చేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినులు ఎంసెట్ పరీక్ష రాయనుండగా 14 మంది బీఎస్సీ నర్సింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. హాజరు శాతం మాత్రం తక్కువగా ఉంది. 50 మంది విద్యార్థులు మాత్రమే ఈ శిక్షణకు హాజరవుతున్నారు. నిర్మల్‌లో 94 మంది విద్యార్థులు ఎంసెట్ శిక్షణకు దరఖాస్తు చేసుకోగా హాజరుశాతం మెరుగ్గానే ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్‌లో 77మంది నమోదు చేసుకోగా 50మంది శిక్షణ పొందుతున్నారు. మంచిర్యాల జిల్లాలో 87 మంది దరఖాస్తు చేసుకోగా 60 మంది వరకు తరగతులను వీక్షిస్తున్నారు. వీరికి ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8గంటల వరకు జూమ్ యాప్ ద్వారా తరగతులను బోధిస్తున్నారు. సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు కేజీబీవీ పీజీ సీఆర్టీలను ప్రత్యేకంగా నియమించారు. సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు.

35 రోజుల పాటు శిక్షణ..

ఎంసెట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు 35 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. రోజుకు సబ్జెక్టుకు 40చొప్పున బిట్స్ చెబుతున్నారు. వీటిలో 20 బిట్స్ బోధిస్తుండగా మరో 20 బిట్లను ప్రాక్టీస్ కోసం వాట్సాప్ గ్రూప్‌లో పంపుతున్నారు. ప్రతీ విద్యార్థికి ప్రత్యేక ఐడీ కేటాయించారు. సాంకేతిక కారణాలతో కొంతమంది శిక్షణకు హాజరు కాలేకపోతుండగా మరికొంతమంది స్మార్ట్‌ఫోన్‌లు లేక శిక్షణకు దూరమవుతున్నారు. గతేడాది నేరడిగొండ కేజీబీవీకి చెందిన ముగ్గురు విద్యార్థినులు బీఎస్సీ నర్సింగ్ సీట్లు సాధించారు. అదేవిధంగా బోథ్‌కు చెందిన ఓ విద్యార్థిని హైదరాబాద్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించింది.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఇస్తున్న ఎంసెట్ శిక్షణ తరగతులను కేజీబీవీ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి. ఆదిలాబాద్ జిల్లాలో 161 మంది విద్యార్థినులు ఎంసెట్ కోసం, 14మంది విద్యార్థినులు బీఎస్సీ నర్సింగ్ శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి జూమ్ యాప్ ద్వారా తరగతులు బోధించడం జరుగుతుంది. విద్యార్థినుల హాజరు తక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు ప్రోత్సహించి శిక్షణ తరగతులకు హాజరయ్యేలా చూడాలి. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు పీజీ సీఆర్టీలను నియమించాం.

– ఉదయశ్రీ, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి

108లో ప్రసవం


పాపతో బాలింత, సిబ్బంది

జన్నారం: కొత్తపేట పంచాయతీ పరిధిలోని రాయికుంటకు చెందిన మర్సుకోల సుఖదేవికి మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. సదరు సిబ్బంది మహిళను వాహనంలో జన్నారం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమయ్యాయి. పైలెట్ రఫీక్ వాహనాన్ని పక్కకు నిలుపగా ఈఎంటీ దేవేందర్ డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను వాహనంలో జన్నారం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు.

జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక


ప్రశంసపత్రం అందుకుంటున్న సందీప్

లక్సెట్టిపేట(మంచిర్యాల): పట్టణానికి చెందిన సందీప్ జాతీయస్థాయి చిత్రకారుల పోటీలో ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారులు ఏలూరి శేషబ్రహ్మం ఆధ్వర్యంలో జెఎన్‌ఎఫ్‌ఏయూ హైదరాబాద్‌లో 21రోజుల పాటు కొనసాగిన పోటీల్లో పెన్సిల్‌తో వేసిన చిత్రకారుల ఫొటోల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు అవార్డు లభించినట్లు ఆయన పేర్కొన్నారు. పోటీల్లో 400 మంది చిత్రకారులు పాల్గొనగా 21 మంది అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.

గాలివాన బీభత్సం


మాదారంలో చెట్టును తొలగిస్తున్న సిబ్బంది


రెబ్బెన: సింగరేణి గెస్ట్‌హౌస్ వద్ద షెడ్డుపై పడిన చెట్టు


తాండూర్‌లో నేలరాలిన మామిడి కాయలు

- తాండూర్, రెబ్బెనలో వడగళ్ల వాన
- విరిగిపడ్డ వృక్షాలు
- పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు
- నేలరాలిన మామిడి కాయలు

తాండూర్(బెల్లంపల్లి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. గంటపాటు కురిసిన రాళ్ల వర్షానికి మామిడికాయలు నేలరాలాయి. పలుచోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. కొత్తపల్లి, ద్వారకాపూర్, అచ్చులాపూర్, నీలయపల్లి తదితర గ్రామాల్లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి తోడు వీచిన పెనుగాలులకు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తాండూర్ నుంచి తిర్యాణి వెళ్లే దారిలో స్తంభాలు విరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లిలో తాటిచెట్టు విరిగి ఇంటిపై పడడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వం పరిహారం అందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రెబ్బెన: కుమురంభీం జిల్లా రెబ్బెన మండలంలోని గోలేటి, రెబ్బెన, కైరిగూడ, పులికుంట తదితర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్ వద్ద భారీ వృక్షం వేళ్లతో సహా రేకులషెడ్డుపై పడిపోయింది.

టింబర్‌యార్డు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


డీజీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): టింబర్‌యార్డులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని హెచ్‌ఎంఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ నాయకులు టింబర్‌యార్డును సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ప్రమోషన్లు లేవన్నారు. నాలుగో కేటగిరీ పనులు చేస్తున్నా ఒకటో కేటగిరీ వేతనాలు చెల్లిస్తుండడంతో శ్రమదోపిడీకి గురవుతున్నారన్నారు. పనిస్థలాల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ సంఘాల వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అనంతరం స్టోర్స్ డీజీఎం సోమశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి కార్యదర్శి తిప్పారపు సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, స్టోర్స్ పిట్ సెక్రటరీ పల్లె క్రాంతికుమార్, నాయకులు నామాల శ్రీనివాస్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో టీబీజీకేఎస్ విఫలం

- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్


మాట్లాడుతున్న పేరం రమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ సెంటిమెంటును అడ్డం పెట్టుకుని గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘం (బీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ ఆరోపించారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపిస్తే సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగులకు బదులు కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నిండిపోతుందన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చిందన్నారు. సంస్థకు రావాల్సిన రూ.20వేల కోట్లను వెంటనే చెల్లించాలని, సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీల పేరిట కోట్ల రుపాయలను ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాబోయే గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఊరగొండ తిరుపతి, కార్యదర్శి అంబేడ్కర్, మల్లికార్జున్, జలపతిరావు, మల్లేశ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే యువతకు భవిష్యత్

- బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

రెబ్బెన(ఆసిఫాబాద్): యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ అన్నారు. ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల భీమన్న స్టేడియంలో మంగళవారం వేణుగోపాల్ స్మారక ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 12 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీఎం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తితో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఏటా ఉద్యోగులకు డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో వార్షిక క్రీడలు, భూనిర్వాసిత ప్రాంతాల యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కేహెచ్ఎస్ గుప్తా, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, స్పోర్ట్స్ పర్యవేక్షకులు సుందర్‌రాజ్, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, బెల్లంపల్లి రీజియన్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, కోఆర్డినేటర్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

'గుడిపేటలో వైద్యకళాశాల ఏర్పాటు చేయాలి'


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రానికి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ శివారులోని 40 ఎకరాల ప్రభుత్వ స్థలం వైద్యకళాశాలకు అనువుగా ఉందని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, రైతుబంధు మండల కన్వీనర్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, జెడ్పీసీఈవో నరేందర్, డీపీవో వెంకటేశ్వర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వైకుంఠధామాల్లో నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించి వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రీడాప్రాంగణాల్లో క్రీడా సామగ్రిని సమకూర్చాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లెప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు.

కైరిగూడ ఓసీపీని సందర్శించిన డైరెక్టర్


అధికారులతో చర్చిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని మంగళవారం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జి.వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి ఓసీపీలో పర్యటించారు. ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు సివిల్ పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వట్టివాగు డైవర్షన్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల ఉన్నతాధికారులతో ఏరియా స్థితిగతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనపై మార్గ నిర్దేశం చేశారు. కార్యక్రమాల్లో ఎస్‌వోటూ జీఎం గుప్తా, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1 గ్రామానికి చెందిన ఓ యువతి మంగళవారం అదృశ్యమైనట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని తాను చదివే కళాశాలకు వెళ్లివస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈమేరకు యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అధికారిని సన్మానిస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేవీఎస్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు బీమా చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు పడాల రామన్న, ప్రధాన కార్యదర్శి చింతల మల్లేశ్, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న క్లర్క్‌లకు సన్మానం


క్లర్కులతో జీఎం, ఇతర అధికారులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ ఇంటర్నల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి జూనియర్ అసిస్టెంట్లుగా(క్లర్క్) బదిలీపై వెళ్తున్న 12 మందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం వద్ద బదిలీ అవుతున్న మహిళా క్లర్కులను జీఎం శాలువాతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో చక్కగా రాణించి పేరు తెచ్చుకోవాలన్నారు. ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, పీఎం రాజేశ్వర్‌రావు, సీనియర్ పీఓ ప్రకాశ్‌రావు, లా ఆఫీసర్ బందిత, ఎస్సీ లైజనింగ్ అధికారి కిరణ్‌కుమార్, అసోసియేషన్ పిట్ సెక్రటరీ విటీకర్, సిబ్బంది అఖిల, పూజిత పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

కౌటాల(సిర్పూర్): మండలంలోని తుమ్మిడిహెట్టి పంచాయతీ పరిధిలోని జనగాం గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ధనుర్కర్ యోగేశ్వర్(31) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై సిర్పూర్(టి)కి వెళ్తుండగా జనగాం సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.